
అక్రమాలు.. ఇసుకేస్తే రాలనంత

■ రవాణా ఛార్జీల పేరుతో వాహన యజమానుల దోపిడీ



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణ రంగంలో వేగం పుంజుకుంది. ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో కార్మికులకు చేతినిండా పని లభించింది. ఇంతవరకు బాగానే ఉన్నా కొందరు అక్రమార్కులు వినియోగదారుల అవతారమెత్తారు. ఇసుకను తరలించే వాహనదారులే ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకుని ట్రాక్టరు ఇసుకను రూ.5 వేల నుంచి రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. రూ.1,500 ఇసుకకు.. రవాణా భారం మూడింతలు.. రూ.4500 వరకు భారం పడుతోంది. రవాణా ఛార్జీలే ఎక్కువవుతున్నాయని వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. దూరభారం పేరుతో అధిక ధరలకు ఇసుక విక్రయాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు.

● ఇసుక వాహనదారులు దూరాన్ని బట్టి రూ.5 వేల నుంచి 6 వేలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :

వేధిస్తున్న సర్వర్ సమస్యలు

ఇసుక అవసరార్థులు ఆన్‌లైన్‌లో ఇసుకను బుకింగ్ చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆఫ్‌లైన్ కంటే ఆన్‌లైన్‌లో ఎక్కువ బుకింగ్ జరగాల్సి ఉండగా సర్వర్ ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి. ఆఫ్‌లైన్‌లో లక్షన్నర టన్నులకు పైగా విక్రయాలు జరగ్గా.. ఆన్‌లైన్ విధానంలో లోపాలు, సాంకేతిక సమస్యలతో ఇసుక నమోదు పడిపోయింది.. గత నెల 19 నుంచి ఇప్పటివరకు పరిశీలిస్తే 3,544 వాహనాలకు 60,548 టన్నుల ఇసుకకు బుకింగ్ జరిగింది. కానీ 3,196 వాహనాలకు 56,582 టన్నులకుపైగా ఇసుక పంపిణీ జరిగింది. గతంలో ఆరు వేల మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా.. ప్రస్తుతం 2 వేల మంది కంటే తక్కువగానే బుకింగ్ చేసుకుంటున్నారు.

వినియోగదారుల అవతారమెత్తి..

ఆన్‌లైన్ విధానం ప్రారంభమైనప్పటి నుంచి అక్రమార్కులు చొరబడ్డారు. ట్రాక్టర్లు, టిప్పర్ల యజమానులే ఆన్‌లైన్‌లో ఇసుక కోసం బుకింగ్ చేసుకొని సి.బెళగల్ ఇసుక డిపోల నుంచి కర్నూలు, ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. 18 టన్నుల ఇసుక టిప్పరు రూ.18-20 వేలకు పైబడి ధర పలుకుతోంది. అంటే టన్ను రూ.1,000 ఉంది. ప్రభుత్వం టన్ను ఇసుక ధర రూ.320 నిర్ణయించగా.. రవాణా ఛార్జీలే టన్నుకు రూ.680కు పైగా వెచ్చించాల్సి వస్తోంది. ఇసుక కంటే రవాణాకే రెట్టింపు ఛార్జీలు భరించాల్సి వస్తోంది. ఓ టిప్పరు యజమాని 18 టన్నుల ఇసుకను ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొని గడివేములలో రూ.26 వేలకు అమ్మినట్లు సమాచారం. ఇలా కొందరు టిప్పర్ల యజమానులు ఇసుకను వారే బుకింగ్ చేసుకొని కర్నూలుతోపాటు ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం, నంద్యాల తదితర ప్రాంతాలకు అధిక ధరలకు సరఫరా చేస్తున్నారు.

వినియోగదారులు ఇసుకను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే ఆ రసీదులను తీసుకొని సి.బెళగల్ రీచ్‌ల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి. బుకింగ్ చేసుకున్న రెండు రోజులకు ఇసుక చేరుతోంది. ఇసుక నమోదు చేసుకొని.. వాహనం సమకూర్చుకొని.. రీచ్ వద్దకెళ్లి తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో ఇసుక డిపోల్లో ఇసుక అందుబాటులో ఉంచితే ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

ఐదింటిలో తవ్వకాలు

ప్రస్తుతం సి.బెళగల్ మండలంలోని కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల, పల్దొడ్డి గ్రామాల్లో డీసిల్టింగ్ పాయింట్లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ ఐదింటిలో డ్రెడ్జింగ్ పద్ధతిలో ఇసుక తవ్వి నది గట్టున ఇసుక నిల్వ ఉంచుతున్నారు. మొత్తం 3,87,495 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉండగా ఇప్పటి వరకు 2.13 లక్షల మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయి. ఆ ఐదు డీసిల్టింగ్ పాయింట్లలో ఇంకనూ 1.73 లక్షల టన్నుల ఇసుక లభ్యత ఉంది.

● సి.బెళగల్ మండలంలో ఆఫ్‌లైన్‌లో రోజుకు ఐదారు వేల బుకింగ్‌లు జరగడం గమనార్హం. ఆఫ్‌లైన్‌లో సెప్టెంబరు 18 వరకు 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలు జరిగాయి.

భవిష్యత్తు అవసరాల నేపథ్యంలో..

● భవిష్యత్తు అవసరాల నిమిత్తం జిల్లాలోని నాలుగు ఇసుక రీచ్‌లను గుర్తించారు. మరళి-1 ఇసుక రీచ్ 16వ తేదీన అందుబాటులోకి రానుంది. ఈ రీచ్‌లో 72,735 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి.

● మరళి-2, గుడికంబాలి, నదిచాగి రీచ్‌లకు ఈనెల 15న బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాల్సి ఉంది. రోజుకు 4-5 వేల టన్నుల ఇసుక సామర్థ్యంతో 2025 జనవరి వరకు ఇక్కడ ఇసుక తవ్వకాలకు అనుమతులున్నాయి.

దిగుబడులు తడిసి.. కష్టమే మిగిలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: భారీ వర్షంతో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పంట కోస్తున్నారు. దిగుబడులు ఆరబెట్టుకుంటున్న సమయంలో ఆదివారం కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో తడిసిపోయాయి.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3,800 హెక్టార్లలో మొక్కజొన్న సాగైంది. నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని నందికొట్కూరు, మిడుతూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో రైతులు ఎక్కువగా మొక్కజొన్న సాగు చేశారు. గత నెలలో కురిసిన వర్షానికి సుమారు 1,800 హెక్టార్లలో మాత్రమే పంట నష్టం జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల మేర దిగుబడి రావాల్సి ఉండగా వర్షాల కారణంగా 20 క్వింటాళ్లు కూడా రాని పరిస్థితి. ఎకరాకు సుమారు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారు.


తడిసిపోయిన మొక్కజొన్న దిగుబడులు

ధర అంతంతే..

నిత్యం కురుస్తున్న వానలతో మొక్కజొన్న రైతులు దిగాలు చెందుతున్నారు. గత నెలలో రెండు వారాలుగా కురిసిన వర్షాలతో పంటలో నీరు నిలిచిపోయి కంకి పెరగక గింజ సన్నగిల్లింది. పండిన పంట విక్రయించే సమయంలో ధర పడిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం క్వింటా రూ.2,200 పలుకుతోందని రైతులు పేర్కొంటున్నారు.

పీఆర్సీ వెంటనే అమలు చేయాలి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

నంద్యాల పాత పట్టణం, గాంధీచౌక్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లు, కార్మికులకు 12వ పీఆర్సీని అమలు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల కోరారు. పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య నంద్యాల జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఐదు డీఏల బకాయి ఉందని.. ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య, రవికుమార్, చెంచురెడ్డి, బాలనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి కథ కంచికే!

రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే అక్రమాలను అడ్డుకోవడంలో అవినీతి నిరోధక శాఖ పాత్ర కీలకం. ఆ శాఖ అధికారులు నిరంతరం నిఘా ఉంచి అవినీతిపరుల భరతం పట్టేవారు. పక్కా వ్యూహం రచించి తప్పించుకోకుండా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించేవారు. అంతటి కీలకమైన కర్నూలు రేంజి అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో డీఎస్పీ స్థానం దాదాపు ఐదు నెలలుగా ఖాళీగా ఉంది. కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించి అనిశా కార్యాలయం కర్నూలులోనే ఉంది. ఒక డీఎస్పీ, ఆరుగురు సీఐలు, సిబ్బంది ఉంటారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులపై వచ్చే ఫిర్యాదులు స్వీకరించి పకడ్బందీ వ్యూహం రచించడం.. ఆదాయానికి మించి ఆస్తులున్న వారి వివరాలు సేకరించి దాడులు చేయడం వంటివి డీఎస్పీ ఆధ్వర్యంలోనే జరుగుతాయి.

■ అధ్వానంగా అనిశా పనితీరు

■ 9 నెలల్లో 3 కేసులే..

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే



నాటి మంత్రి నిర్వాకంతోనే..

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఓ మంత్రి పెత్తనం చెలాయించారు. డీజీపీ.. ఆయన బంధువు, సన్నిహితుడు కావటంతో ఇష్టానుసారంగా వ్యవహరించారు. చివరికి అవినీతి నిరోధక శాఖను సైతం వదలిపెట్టకుండా జోక్యం చేసుకున్నారు. కర్నూలు అనిశా డీఎస్పీగా ఉన్న శివనారాయణ స్వామి ఆదోని డీఎస్పీ స్థానానికి బదిలీ అయిన తర్వాత ఆ పోస్టు కొద్ది రోజులు ఖాళీగా ఉండేది. అవినీతి నిరోధక శాఖకు సరిపోయే ఓ డీఎస్పీని నియమించాలని ప్రతిపాదనలు వెళ్లగా సదరు మంత్రి అడ్డుకున్నారు. కొందరు అవినీతి అధికారుల వినతిమేరకు అనిశా డీఎస్పీని నియమించకుండా కుట్ర చేశారన్న ఆరోపణలున్నాయి.

ఎన్నికల నేపథ్యంలో..

సార్వత్రిక ఎన్నికలకు ముందు మే నెలలో కర్నూలు అనిశా డీఎస్పీగా ఉన్న వెంకటాద్రి చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. అనంతరం ఎన్నికలు వచ్చాయి. అప్పటి నుంచి ఈ పోస్టు భర్తీకి నోచుకోలేదు. జిల్లా ఇన్‌ఛార్జి అనిశా డీఎస్పీగా కడప డీఎస్పీ గిరిధర్ వ్యవహరించేవారు. ఎన్నికల తర్వాత ఆయన సైతం మరో విభాగానికి బదిలీ కావడంతో సీఐనే ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల అనిశాలో మరో ముగ్గురు సీఐలు మాతృ శాఖకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం కేవలం ముగ్గురు సీఐలు మాత్రమే ఉన్నారు.


పనితీరు మందగించి..

కీలకమైన డీఎస్పీ స్థానం ఖాళీగా ఉండటంతో అనిశా పనితీరు మందగించింది. బాధితులు ఫిర్యాదు చేస్తున్నా స్పందన కానరావడం లేదు. కర్నూలుకు చెందిన ఓ వ్యక్తికి మరో మండలంలో ఉన్న తన పొలానికి సంబంధించి సమస్య రాగా పరిష్కరించుకునేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారిని కలిశారు. ఆయన లంచం డిమాండ్ చేయటంతో భరించలేకపోయారు. అనిశా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. చివరికి డబ్బులిచ్చి పని చేయించుకోవాల్సి వచ్చింది.

కూటమి ప్రభుత్వం వచ్చినా..

ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు పరిశీలిస్తే కర్నూలు అవినీతి నిరోధక శాఖ కేవలం మూడు కేసులు మాత్రమే నమోదు చేయటం గమనార్హం. డీఎస్పీ వెంకటాద్రి బదిలీ అయిన తర్వాత ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. దీనిని పరిశీలిస్తే అనిశా పనితీరు ఎలా ఉందో అర్థమవుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా కీలకమైన అనిశా డీఎస్పీ స్థానం భర్తీ చేయకపోవడం గమనార్హం.

కైలాస వాహనంపై శ్రీశైల మల్లన్న


ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తీసుకొస్తున్న శ్రీశైలం ఈవో, అధికారులు


ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో దసరా ఉత్సవాలు నేత్రశోభితంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారు భక్తులకు కూష్మాండదుర్గగా సాక్షాత్కరించారు. ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదికపై కూష్మాండదుర్గ అష్టభుజదేవిగా కొలువుదీరారు. అమ్మవారి నామస్మరణలను కీర్తించిన అర్చకులు కుంకుమార్చన, పుష్పార్చనలు నిర్వహించారు. అనంతరం అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవమూర్తులు కైలాస వాహనంపై కొలువుదీరారు. ఉభయ దేవాలయాల అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవానికి తీసుకొచ్చారు. ఈవో డి.పెద్దిరాజు దంపతులు నారికేళాలు, మంగళహారతులు సమర్పించారు. అనంతరం ప్రధాన పురవీధుల్లో కైలాస వాహనంపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవంలో కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.



ఉత్సవాల్లో నేడు : దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీభ్రమరాంబా దేవి అమ్మవారు భక్తులకు స్కందమాతగా దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు శేష వాహనసేవ నిర్వహిస్తారు.


మహానందిలో గ్రామోత్సవం

శ్రీశైలం అభివృద్ధి పనులపై విజిలెన్స్ నిఘా

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా పెట్టారు. దేవస్థానం అభివృద్ధి పనుల్లో రూ.కోట్ల నష్టం జరిగిందన్న సమాచారంతో విచారణకు సంబంధించి కర్నూలు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిణి చౌడేశ్వరి దేవస్థానం ఈవోకు లేఖ రాశారు. 2021-24 మధ్య చేపట్టిన ఇంజినీరింగ్ పనులు, వాటి అనుమతులు, అంచనాలు, ఎం.బుక్ దస్త్రాలు సిద్ధం చేయాలని, వాటిని తమకు చూపాలని లేఖలో కోరారు. గణేశ్ సదన్, సరిహద్దుల నిర్మాణ పనుల వివరాలు ఇవ్వాలని సూచించారు. త్వరలో విజిలెన్స్ అధికారులు శ్రీశైలానికి చేరుకొని క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ పనులను పరిశీలించనున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. స్థానిక సెంటినరీ హాలులో సోమవారం ఉదయం 10.30 నుంచి నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు ఆమె ఆదివారం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

పల్లె మార్గం.. ప్రయాణ యోగ్యం

■ మరమ్మతులకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం

గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ పాలనలో గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రయాణ యోగ్యం కాకుండా మారాయి. వీటిపై రాకపోకలు సాగించేందుకు గ్రామీణులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధ్వానంగా మారిన పంచాయతీరాజ్ రహదారులను బాగు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మరమ్మతులు చేపట్టాల్సిన రోడ్లకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు సేకరించింది. ప్రస్తుతం నిధుల కేటాయింపునకు ప్రణాళికలు రూపొందిస్తోంది.

నంద్యాల పట్టణం, మహానంది, న్యూస్‌టుడే :



వీటిపై ప్రత్యేక శ్రద్ధ

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పంచాయతీరాజ్ రహదారుల్లో 192 కి.మీ. మేర దారుణంగా దెబ్బతిన్నాయి. వీటిపై 20 కి.మీ. వేగానికి మించి వాహనాలు ప్రయాణించలేని పరిస్థితి. మరో 1,010 కి.మీ. రోడ్లపై 40 కి.మీ. వేగంతో కూడా వెళ్లలేని దుస్థితి. వీటి మరమ్మతులకు నిధులు కేటాయించేందుకు కసరత్తు జరుగుతోంది. ఎన్‌డీబీ, ఏడీబీ, క్లోరనెట్ నిధులతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎంజీఎస్‌వై, ఏపీ ఆర్ఆర్‌పీ, నాబార్డు కింద రహదారులపై మరమ్మతులకు అవసరమైన నిధుల వివరాలను ప్రభుత్వం తీసుకుంది.

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా ఉన్న రహదారుల వివరాలు

జిల్లా	20 కి.మీ. వేగం మించి ప్రయాణించలేని రోడ్లు	40 కి.మీ. వేగం మించి ప్రయాణించలేని రోడ్లు
కర్నూలు	114	478
నంద్యాల	78	532

నియోజకవర్గాల వారీగా నివేదికలు

వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో వివిధ పథకాల కింద చేపట్టిన రహదారుల అభివృద్ధి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. కర్నూలు జిల్లాలోని కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు నియోజకవర్గాల్లో సుమారు రూ.200 కోట్ల విలువ చేసే పనులు ఆగిపోయాయి. వీటికి త్వరలో మరమ్మతులు చేయనున్నారు. నంద్యాల జిల్లాలో శ్రీశైలం, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల్లో సుమారు రూ.150 కోట్ల విలువ చేసే రహదారుల పనులు నిలిచిపోయాయి. వీటిలో అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సిన రహదారులకు సంబంధించి ప్రభుత్వం ప్రతిపాదనలు తెప్పించుకుంది. కొన్నింటికి ఇప్పటికే పరిపాలనా పరమైన అనుమతులు ఇచ్చింది. ప్రస్తుతం అధికారులు మరమ్మతులు ప్రారంభించే దిశగా చర్యలు చేపడుతున్నారు.

వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం

రహదారుల నిర్వహణకు గత వైకాపా ప్రభుత్వం పైసా నిధులు ఇవ్వలేదు. కొత్తవి నిర్మించకపోగా.. ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు కూడా చేయించలేని దుస్థితి ఏర్పడింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్ రహదారులపై దృష్టి సారించింది. ముందుగా రాకపోకలకు ఏమాత్రం అనుకూలంగా లేని రహదారులపై దృష్టి సారించింది. 20 కి.మీ. కంటే వేగంగా వాహనాలు నడపలేని దుస్థితిలో ఉన్న వాటికి తొలి ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు చేపట్టింది. రెండో ప్రాధాన్యం కింద 40 కిలోమీటర్ల కంటే వేగంగా వాహనాలు నడపలేని రహదారులకు మరమ్మతులు చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి రహదారులను గుర్తించారు.

ఏటీఎంలో నగదు చోరీకి విఫలయత్నం
తపాలా ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలి 10

శ్రీశైలం నీటిమట్టం 881.90 అడుగులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం నీటిమట్టం ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి 881.90 అడుగులు, నీటినిల్వ 198.3623 టీఎంసీలుగా నమోదైంది. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 85,756 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 49,694 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.


జలాశయంలో గుర్రపుడెక్క

నడకలో స్నేహబంధం..

◆ రాణిస్తున్న క్రీడాకారిణులు
◆ పలు పోటీల్లో ప్రతిభ

మైదానంలో పోటీ తరుణం





పరుగు పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: మైదానంలో మొదలైన నడక స్నేహం వైపు సాగింది. తరుణీ మణులు ఆరోగ్య శ్రీమంతులుగా మారారు. స్నేహ బంధాలు.. క్రీడా బృందాలుగా మారాయి. నిత్యం సాగించిన సాధన.. పతకాలు సాధించేలా చేసింది. వయసుతో సంబంధం లేకుండా పోటాపోటీగా బరిలో దిగారు.. విజయాల జత కట్టారు. ఆదోని మహిళ క్రీడల్లో ప్రతిభ చాటారు.

అలా మొదలైంది..

ఆదోని ఆర్ట్స్ కళాశాల మైదానం మహిళలంతా ఉదయపు నడకకు వెళ్లేవారు. పరిచయాలతో క్రీడాజట్టుగా ఏర్పాటయ్యారు. వీరికి మాస్టర్ అథ్లెటిక్స్ జాతీయ క్రీడాకారిణి ఏలిగే సీమ పరిచయం కావడంతో మైదానంలో వీరి సాధనకు శ్రీకారం చుట్టారు. నచ్చిన ఆటలో మెలకువలు అందిపుచ్చుకున్నారు. ఇదే తరుణంలో ఆదోనిలో ఉమ్మడి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడా మీట్ ఉండటంతో సీమ సహకారంతో వీరంతా పోటీల్లో పాల్గొనాలని నిర్ణయించారు. సుమారు 50 మందికి పైగా మహిళలు ఆదోని నుంచి పోటీల్లో పాల్గొన్నారు. ఆదోని మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 29వ తేదీన ఆదోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న తొలిసారి పోటీల్లోనే తమ ప్రతిభ కనబరచి పతకాలు అందుకున్నారు. ఇదే ఉత్సాహంతో రాష్ట్ర స్థాయి మీట్‌కు సిద్ధమవుతూ రోజు వారీ సాధనను ముమ్మరం చేశారు.

రోజు వారీ వ్యాయామంతో..

నా పేరు సుహాసిని.. వస్త్ర వ్యాపారం చేస్తున్నా. భర్త నాగరాజు వ్యాపారి. మాకు ఇద్దరు పిల్లలు. రోజూ ఉదయం నుంచి తీరిక లేకుండా.. వస్త్ర దుకాణం నిర్వహణతో అలసటగా ఉండేదాన్ని. మైదానంలో చేస్తే ఉపశమనంగా ఉంటుందని పలువురు సలహా ఇచ్చారు. అలా ఉదయం నడకకు వెళ్లడం, వ్యాయామం చేయడంతో జీవనశైలిలో ఎంతో మార్పు వచ్చింది. ఇదే తరుణంలో పోటీల విషయం తెలిసి, పాల్గొన్నా. 800 మీటర్ల పరుగులో బంగారు, డిస్కస్ త్రోలో వెండి, షాట్‌పుట్‌లో బంగారు పతకం అందుకున్నా. ఇలాంటి పోటీలు మనలో ప్రతిభను వెలికితీసేందుకు ఎంతో దోహదపడుతుంది.





ఉత్సాహం నింపింది

నా పేరు శాంతి. మా వారు బ్రహ్మ వ్యాపారవేత్త. మాకు ఒక అబ్బాయి. నేను గృహిణిగానే ఉండేదాన్ని. కొన్ని సమస్యల కారణంగా వైద్యులను సంప్రదిస్తే.. వ్యాయామం చేయాలని సూచించారు. మైదానంలో అడుగు పెట్టాక.. ఆరోగ్యపరంగా చాలా మార్పులు వచ్చాయి. క్రమం తప్పకుండా క్రీడలు సైతం సాధన చేశారు. మైదానం మిత్రులతో కలిసి పోటీల్లో పాల్గొన్నా. వంద మీటర్ల పరుగు పందెంలో వెండి, డిస్కస్ త్రో, 800 మీటర్ల పరుగు పందెంలో రజత పతకాలు కైవసం చేసుకున్నా. పతకాలు సాధించేంత ప్రతిభ ఉందని ఊహించలేదు.



ఇద్దరం ఉద్యోగులమే..

నా పేరు శిరీష, మా ఆయన నర్సారెడ్డి. ఇద్దరం ఉద్యోగులం. మాకు ఒక అబ్బాయి. చిన్నతనం నుంచే క్రీడలంటే ఆసక్తి. పెళ్లయ్యాక తీరిక లేకపోవడంతో ఇంటి పనులు, ఉద్యోగంతోనే సరిపోయేది. బాబు కాస్త పెద్దవాడు కావడంతో.. ఆరోగ్యానికి కొంత సమయం కేటాయిస్తున్నా. ఆదోనిలో వెటరన్స్ పోటీల్లో వంద మీటర్ల పరుగు, ట్రిపుల్ జంప్‌లో బంగారు, జావలిన్ త్రోలో వెండి పతకాలు అందుకున్నా.



జాతీయ స్థాయిలో రాణించాలని

నా పేరు శ్వేతారెడ్డి. మా ఆయన సురేంద్రరెడ్డి వ్యాపారం. మాకు నలుగురు సంతానం. చిన్నతనంలో పాఠశాల స్థాయిలో ఆటలు ఆడా. ఇంటికి దగ్గరగా మైదానం ఉండటంతో రోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయిస్తున్నా. క్రీడా సాధన చేస్తూ.. ఇప్పటి వరకు ఐదు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో, ఏడు సార్లు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నా. మూడు సార్లు జాతీయ స్థాయిలో, రెండు అంతర్జాతీయ స్థాయి ఆటలు ఆడా. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించాలనేది నా ఆశయం. ఆ దిశగా సాధన చేస్తున్నా..


భారీ వర్షం.. రైతుకు కష్టం



నందికొట్కూరులో అకాలవర్షాలతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి నందికొట్కూరు పరిధిలోని పొగాకు, ఉల్లి, మొక్కజొన్న, కంది పంట పొలాలు నీట మునిగాయి. ఆరబెట్టుకున్న మొక్కజొన్న తడవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నందికొట్కూరు

మొలకలొచ్చి.. అప్పులు మిగిల్చి



చేతికొచ్చిన పంట నోటికందకుండా పోయింది. రైతుచేసిన కష్టం ఒక్క వానతో తుడిచిపెట్టుకుపోయింది. రెండు రోజుల్లో పంటను విక్రయిస్తే డబ్బులు చేతికొస్తాయనకుంటే అసలు కూడా రాని దుస్థితి నెలకొంది. పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో సాగుచేసిన సోయాపంట, మొక్కజొన్న కల్లాల్లో నీటమునిగాయి. గింజలకువెంటనే మొలకలొచ్చాయి. కోట్లాదిరూపాయల నష్టం వాటిల్లింది. తడిచిన పంటను వ్యాపారులు కొనే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, గడిఎముల

అహోబిలంలో
నవరాత్రి ఉత్సవాలు

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం) న్యూస్‌టుడే : అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉత్సవాల్లో భాగంగా ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారిని అద్దాల మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకం జరిపారు. పసుపు, చందనం, కర్పూరం వంటి లేపనాలు సమర్పించి ధూపదీపాలతో మహామంగళహారతి అందించారు. సాయంత్రం అమృతవల్లి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి,అమ్మవారిని పల్లకిపై కొలువుంచి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో అమృతవల్లి

కూష్మాండదుర్గగా మహాదేవి

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో ఆదివారం రాత్రి అమ్మవారిని కూష్మాండదుర్గగా అలంకరించారు. వేద పండితులు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డితో పాటు 20 మందికిపైగా దాతల దంపతులతో విశేష పూజలు చేయించారు. బెంగళూరుకు చెందిన ప్రశాంతి నాట్యకళాక్షేత్రం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది.



అమ్మవారికి కుంభహారతి ఇస్తున్న వైద్యనాథ శివాచార్యపండిట్



మొక్కజొన్నను చూపుతున్న నాయకులు

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

తమడపల్లె, (మహానంది), న్యూస్‌టుడే: మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండు చేశారు. ఆదివారం ఆయన మహానంది మండలం తమడపల్లె గ్రామంలో రైతులు పండించి ఆరబోసిన మొక్కజొన్నను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంట చేతికి వచ్చాక సగం ఆదాయం దళారులు, వ్యాపారుల చేతిలోకే వెళ్తోందన్నారు. సెప్టెంబరు మొదటివారంలో క్వింటా రూ.2,950 ఉంటే అది ప్రస్తుతం రూ.2,350 లకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, మొక్కజొన్న పండించిన రైతులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, భాస్కర్, రాధాకృష్ణ, మండల కార్యదర్శి ఆర్.సామేల్, గురుమూర్తి, లక్ష్మయ్య, చెంచు వెంకటేశ్వర్లు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి మంత్రి ప్రత్యేక పూజలు

బనగానపల్లి, న్యూస్‌టుడే : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బనగానపల్లిలోని దినసరి మార్కెట్‌లో ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహానికి, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యాకాపరమేశ్వరి ఆలయంలో వెలసిన అమ్మవారికి మంత్రి బీసీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు టంగుటూరి శీనయ్య, శ్రీరామ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి చిత్రపటం అందజేస్తున్న ప్రతినిధులు

గృహ నిర్మాణ శాఖ ఏఈ సస్పెన్షన్

నంద్యాల, న్యూస్‌టుడే : ఇసుక మాయం వ్యవహారంలో ఆళ్లగడ్డ మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ రమణారెడ్డిని సస్పెండ్ చేసినట్లు హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ మార్కెట్టు యార్డులో నిల్వ ఉంచిన 600 మెట్రిక్ టన్నుల ఇసుక దారి మళ్లిన వ్యవహారంలో ఉన్నతాధికారుల విచారణ జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఏఈని సస్పెండ్ చేశామని పీడీ తెలిపారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగిక

☛ నాలుగు డిజిటల్ రిసోర్స్ సెంటర్లకు చర్యలు
☛ విద్యార్థుల సందేహాల నివృత్తికి బోధకుల నియామకం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని పక్కన పెట్టింది. విద్యార్థుల బాగుకు ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. అస్తవ్యస్త విధానాలతో విద్యావ్యవస్థకు గ్రహణం పట్టించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విద్యార్థులకు ప్రయోజనకర విధానాలు తీసుకొస్తోంది. వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమ వసతి గృహ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల



బొమ్మలసత్రంలోని బాలికల ప్రీమెట్రిక్ బీసీ వసతి గృహం

మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. తొలుత ఎంపిక చేసిన చోట డిజిటల్ రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేయనుంది. పాఠ్యాంశాలు సులువుగా అర్థమయ్యేలా డిజిటల్ సమాచారాన్ని పెన్‌డ్రైవ్‌ల ద్వారా అందుబాటులో ఉంచనుంది. సొంత భవనాలున్న చోట ఓ గదిని ఆహ్లాదంగా తీర్చిదిద్ది విద్యార్థుల సంఖ్యకు అవసరమైన కుర్చీలను ఏర్పాటు చేస్తూ డిజిటల్ ఇంటరాక్టివ్ బోర్డు ద్వారా బోధించనున్నారు. నంద్యాల జిల్లాలో నాలుగు చోట్ల డిజిటల్ రిసోర్స్‌సెంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

పది మంది పిల్లలుంటే..

బడి నుంచి వచ్చిన తర్వాత వసతిగృహాల్లోని విద్యార్థులకు వివిధ అంశాలపై తర్ఫీదు ఇవ్వనున్నారు. వివిధ అంశాల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించి అభ్యసన సామర్థ్యాలు పెంచేలా చర్యలు తీసుకోనున్నారు. సులువుగా పాఠ్యాంశాలు తెలుసుకొనేందుకు డిజిటల్ విధానంలో వివరిస్తారు. పదో తరగతి విద్యార్థుల్లో అనుమానాలు నివృత్తి చేయడానికి బోధకులను నియమించారు. పది మంది పిల్లలుంటే గణితం, సైన్స్, ఆంగ్లం, హిందీ సబ్జెక్టులకు బోధిస్తారు. ఒక్కో బోధకుడికి నెలకు రూ. 1500 చెల్లించాలని నిర్ణయించారు.

నవంబరు 14న ప్రారంభించేలా...!

నంద్యాల జిల్లాలో ప్రీ మెట్రిక్ బీసీ సంక్షేమ వసతి గృహాలు 33 ఉన్నాయి. ఇందులో 22 ప్రీ మెట్రిక్, 11 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. జిల్లాలోని బీసీ వసతి గృహాలు 28 సొంత భవనాల్లో, అయిదు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో 4,264 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. బనగానపల్లె(బాలుర), డోన్(బాలుర), నంద్యాల(బాలికల), నందికొట్కూరు(బాలుర) బీసీ ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లో డిజిటల్ రిసోర్సుసెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించారు. నవంబరు 14న బాలల దినోత్సవం సందర్భంగా వాటిని ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

అనుమతులు రాగానే ప్రారంభిస్తాం

- ముస్తాక్ అహమ్మద్, జిల్లా బీసీ సంక్షేమాధికారి

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో నాలుగు వసతి గృహాల్లో డిజిటల్ రిసోర్సుసెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించాం. దీంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయి. అనుమతులు రాగానే ప్రారంభిస్తాం.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం ఎస్‌బీఐ కాలనీలోని రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో 42వ జూనియర్స్ బాల బాలికల జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆయా పోటీలను తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ.ఫిరోజ్, గురురాఘవేంద్ర విద్యాసంస్థల అధినేత డా. దస్తగిరిరెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ, సాఫ్ట్‌బాల్ సంఘ జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ అమ్నాకర్ ప్రారంభించి మాట్లాడారు. నంద్యాలలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. నంద్యాలలో జరిగే పోటీలకు 23 రాష్ట్రాల జట్లు ప్రాతినిధ్యం వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సుమారు 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. వైఎస్సార్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఒంటెరు శ్రీనివాసరెడ్డి, గురురాజ పాఠశాల డైరెక్టర్ మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న చండీఘర్, హరియాణా బాలికల జట్లు

తపాలా ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలి

మహానంది, న్యూస్‌టుడే: తపాలా ఉద్యోగులపై ఒత్తిళ్లు తగ్గించాలని ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఏపీ సర్కిల్ కార్యదర్శి వై.మద్రెడ్డి డిమాండు చేశారు. ఆదివారం మహానందిలోని ఈశాని కల్యాణ మండపంలో ద్వైవార్షిక సమావేశాన్ని నంద్యాల డివిజన్ సంఘం అధ్యక్షుడు ఎం.జయన్న, కార్యదర్శి ఎస్.జమాల్‌బాషాల సారథ్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మద్రెడ్డి మాట్లాడారు. కర్మయోగి, ఆన్‌లైన్‌కోర్సులు చేయాలని ఒత్తిడి చేయడం మానుకోవాలన్నారు. అవసరమైన శిక్షణలు ఇవ్వడం లేదన్నారు. 5 గంటలు మాత్రమే పనిచేయాల్సి ఉండగా 8 గంటలు చేయిస్తున్నారని తెలిపారు. 7, 8వ తేదీల్లో సహాయ నిరాకరణ, 9న రాష్ట్ర సంఘం పిలుపుమేరకు డివిజన్ కార్యాలయాల ముందు ధర్నా చేపడతామన్నారు. శైలజ, శశికుమార్, మీరావలి, కృష్ణయాదవ్, శివరామిరెడ్డి, ఆది, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో నంద్యాల డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా కె.రామలింగారెడ్డి, కార్యదర్శిగా టి.శశికుమార్, కోశాధికారిగా ఎం.సుబ్బరాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మద్రెడ్డి

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

శిరివెళ్ల న్యూస్‌టుడే : మండలంలోని యర్రగుంట్ల గాయత్రి ప్రైవేటు ఉన్నత పాఠశాల ఆవరణలో క్రికెట్ ఆడుకునేందుకు వెళ్లిన ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందగా మరో విద్యార్థి ప్రాణాపాయంతో బయటపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం యర్రగుంట్ల బీసీ కాలనీకి చెందిన మేడిదిన్నె రాము కుమారుడు మేడిదిన్నె శ్రీధర్ (14) పాఠశాల ఆవరణలో శ్రీధర్ తన స్నేహితులతో కలిసి ఆదివారం క్రికెట్ ఆడుకునేందుకు వెళ్లాడు. క్రికెట్ బాలు కోసం వెతుకుతూ రేకులషెడ్‌ని పట్టుకోగా విద్యుత్తు సరఫరా అయి మృతిచెందాడు. పక్కనే ఉన్న స్నేహితుడు గౌరిశంకర్ పక్కకు తీసేందుకు యత్నించగా అతను విద్యుత్తుషాక్‌కు గురై గాయాలయ్యాయి. మృతి చెందిన విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు.

తెలుగు గంగ కాలువలో వ్యక్తి గల్లంతు

చాగలమర్రి న్యూస్‌టుడే : మండలంలోని చింతలచెరువు భైరవగుండాల సమీపంలోని తెలుగు గంగ కాలువలో కడప జిల్లా మైదుకూరుకు చెందిన వ్యక్తి నరేష్ (34) గల్లంతైన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుందని ఎస్సై రమేష్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు మైదుకూరుకు చెందిన నరేష్ చోలా ఫైనాన్స్‌లో కడప ఏరియా మేనేజరుగా విధులు నిర్వహిస్తున్నాడు. నరేష్, అతని స్నేహితులు నారాయణరెడ్డి, రఫి, మస్తాన్‌లు కలిసి ఆదివారం మండలంలోని భైరవగుండాల క్షేత్రానికి వెళ్లారు. క్షేత్రం దర్శనం అనంతరం సమీపంలోని తెలుగు గంగ కాలువ, పరిసరాల ఆహ్లాదకరమైన ప్రకృతి అందాలను చూస్తుండగా ప్రమాదవశాత్తు నరేష్ కాలువలో జారిపడ్డాడు. అతన్ని కాపాడేందుకు మరో స్నేహితుడు నారాయణరెడ్డి కూడా కాలువలో దూకాడు. అంతలోనే నరేష్ కాలువలో కొట్టుకు పోయాడు. నారాయణరెడ్డిని స్థానికులు పంచసాయంతో బయటికి తీశారు. స్నేహితులంతా కాలువ వెంట వెతికినా కనపడకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. గల్లంతైన వ్యక్తి నాగరాజు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టామని ఎస్సై వెల్లడించారు.

ఏటీఎంలో నగదు చోరీకి విఫలయత్నం

గాజులపల్లె(మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం గాజులపల్లెమెట్టలోని ఇండియా-1 ఏటీఎంలో నగదు చోరీకి గుర్తుతెలియని దుండగులు విఫలయత్నం చేశారు. శనివారం అర్ధరాత్రి తర్వాత ఏటీఎం పరిసరాల్లోని సీసీ కెమెరాలకున్న తీగల్ని కత్తిరించారు. ఆ తర్వాత వాటిని ధ్వంసం చేసి అందులోని నగదును తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. ఆదివారం ఉదయం కొందరు వ్యక్తులు నగదు కోసం ఏటీఎం వద్దకు వెళ్లగా అక్కడ పరికరాలు ధ్వంసమై ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఏటీఎం నిర్వాహకులు బషీర్‌అహ్మద్ నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



గాజులపల్లెలో ఏటీఎంను ధ్వంసం చేసిన దుండగులు

ఒక్క ఉద్యోగి.. మూడు పోస్టులు

☛ దృష్టి సారించని అధికారులు

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగంలో ఓ ఈఈకి మరో డివిజన్ (ఈఈ స్థాయి) బాధ్యతలు అప్పగించారు. కర్నూలు జిల్లాలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో డీఈఈ, ఏఈఈలు బాధ్యతలు చేపట్టారు. కర్నూలు పీఐయూ, ఆదోని పీఆర్ఐ పోస్టుల్లో నియమించిన ఈఈలు విధుల్లో చేరలేదు. వీరికి సెప్టెంబరు 22న బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కర్నూలు సర్వశిక్ష ఈఈ రఘురామిరెడ్డిని కీలకమైన కర్నూలు డివిజన్ పీఐయూ ఈఈగా నియమించారు. ఆదోని పీఆర్ఐ ఈఈగా డ్వామాలో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్‌ను నియమించినా విధుల్లో చేరలేదు. దీంతో వారి స్థానంలో కర్నూలు పీఆర్ఐ ఈఈ మద్దన్నకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బదిలీ అయిన ఏడు రోజుల్లోనే బాధ్యతలు చేపట్టాలి. మాతృ శాఖ వదిలి మరో శాఖలో (ఫారిన్ సర్వీస్) ఐదేళ్లకుపైగా విధులు నిర్వహించిన ఈఈలు రఘురామిరెడ్డి, వెంకటేశ్‌లు అక్కడినుంచి రిలీవ్ కావడం కష్టంగా మారుతోంది. ఈ మేరకు కొత్తగా వచ్చిన పోస్టింగ్‌లో బాధ్యతలు నిర్వహించేందుకు చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి రావడం లేదు. దీంతో ఒకే ఈఈ మద్దన్న మరో డివిజన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఇరువురికి అదనపు బాధ్యతలు

జలవనరుల శాఖలో రెండు సబ్ డివిజన్ల స్థానంలో అదనపు బాధ్యతలు అప్పగించారు. కేసీసీ కర్నూలు డీఈఈ రఘురామిరెడ్డి క్వాలిటీ కంట్రోల్‌కు బదిలీ కావడంతో ఈయన స్థానంలో నంద్యాల డీఈఈ సుబ్రహ్మణ్యంరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. కేసీసీ డీఈఈగా ఎవరినీ నియమించలేదు. హంద్రీనీవాకు చెందిన ఓ అధికారి ఇక్కడికి అదనపు బాధ్యతలపై వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈయన గతంలో వైకాపాకు అనుకూలంగా వ్యవహరించగా.. కర్నూలులో ఉండేందుకు ఇప్పుడు అధికార కూటమి నాయకులకు సన్నిహితంగా ఉంటూ కేసీసీ డీఈఈ పోస్టుకు ప్రయత్నిస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఏ పార్టీ అధికారంలోకి వస్తే.. ఆ పార్టీ నేతల వెంట తిరుగుతూ కర్నూలులోనే విధులు నిర్వహిస్తుండటంపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

◆ ఇరిగేషన్ కర్నూలు ఎంఐ సబ్ డివిజన్ డీఈఈ జిలానీబాషా పత్తికొండకు బదిలీ కావడంతో ఎవరినీ నియమించలేదు. డోన్ సర్వే ఇన్వెస్టిగేషన్ (ఎస్.ఐ.) విభాగం డీఈఈ కిష్టన్నకు కర్నూలు డీఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన ఇప్పటికే నంద్యాల ఈఈగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత



వన్యప్రాణి వారోత్సవ ర్యాలీలో అటవీ సిబ్బంది, గ్రామస్థులు

బుక్కాపురం(మహానంది), న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యతని డీఆర్వో హైమావతి పేర్కొన్నారు. మహానంది మండలం బుక్కాపురంలో ఆదివారం వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జీవావరణ వ్యవస్థలో సమతుల్యత ఉన్నప్పుడే జీవుల మనుగడ సాధ్యపడుతుందన్నారు. విశ్రాంత ఆర్మీ అధికారి సాయిబాబా, విశ్రాంత వీఆర్వో బుట్టి పాములేటి, ఎఫ్ఎస్‌వో కుమార్, ఎఫ్‌బీవోలు ప్రతాప్, శ్రీనివాసులు, పరమేశ్వరీ, శంకరీబాయ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) నందికొట్కూరు : 94403 61729 ఆత్మకూరు : 90149 09024 నంద్యాల : 98853 28120

ఆత్మకూరు పట్టణం: **సమస్య:** సాయిబాబానగర్‌లో కోవెలకు వెళ్లే మార్గంలో రహదారి నిండా గోతులే ఉన్నాయి. **- నారాయణ.**

సమాధానం: గుంతల్ని పూడుస్తాం.

- షాహీర్, పురపాలక ఏఈ.

సమస్య: స్వరాజ్‌నగర్‌లో మిలటరీకాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న ఓ వీధి దీపం వెలగటం లేదు.

-మహేష్, ఉపాధ్యాయుడు.

సమాధానం: మరమ్మతులు చేయిస్తాం.

-షాహీర్‌బాషా, పురపాలక ఏఈ.

పగిడ్యాల: **సమస్య:** మండల పరిధిలోని ప్రాతకోట గ్రామంలో ఎస్సీ కాలనీ చర్చి సమీపంలో తాగునీటి కుళాయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. **-శ్రీరాములు**

సమాధానం: చర్యలు తీసుకుంటాం.

- ఇసాక్, పంచాయతీ కార్యదర్శి.

రాజ్యాంగంపై ప్రచారోద్యమం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: సర్వసత్తాక దేశంగా ఉండాల్సిన మన విదేశీ విధానం ఏదో ఒక అగ్రరాజ్యానికి ఊడిగం చేసేదిగా తయారైందని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కేఎంఏ. అబ్దుల్ సుభాన్ పేర్కొన్నారు. దేశంలో కార్పొరేట్ల సంక్షేమమే ప్రధాన మార్గంగా మారిందని ఆయన విమర్శించారు. నంద్యాలలో ఆదివారం స్థానిక హోటల్‌లో వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సంక్షేమ రాజ్యం- భారత రాజ్యాంగం పై ప్రచార ఉద్యమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సి.అన్సర్ బాష, సభ్యులు యూనూస్, ఫారుక్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న నాయకులు

కాలనీలు.. నిండా సమస్యలు



బర్మశాలలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నిలిచిన నీరు

ఇబ్బందులు తీరేదెన్నడో...?

కాలనీ : బర్మశాల
వార్డు: 28
జనాభా: 1000

ఇళ్ల మధ్య మురుగు నిలిచి కుంటలను తలపిస్తోంది. దుర్వాసనతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దోమల బెడద ఎక్కువగా ఉంది. ఖాళీ స్థలాలన్నీ పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. విషపురుగులకు ఆవాసాలుగా మారాయి. విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. విద్యుత్తు స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకుని ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగక చీకట్లో ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

నంద్యాల పట్టణంలోని బర్మశాల కాలనీ, సాయిబాబాగర్ సమస్యలకు నిలయాలుగా మారాయి. అయిదేళ్ల వైకాపా పాలనలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో వసతులు కరవయ్యాయి. రెండు కాలనీల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురుగు కాలువలు లేక ఇళ్ల మధ్యలో మురుగు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. విషపురుగుల సంచారంతో ఇబ్బందులుపడుతున్నామని నివాసితులు వాపోతున్నారు. కాలనీలోని సమస్యల్ని పరిష్కరించేందుకు అధికారులు, పాలకులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం



సాయిబాబానగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

శుభ్రం చేయాలి - ప్రభాకర్, బర్మశాల

బర్మశాలలో పారిశుద్ధ్య సిబ్బంది కాల్వలను సరిగ్గా శుభ్రం చేయడంలేదు. రహదారులను బాగు చేయాలి. ఖాళీ స్థలాల్లో మురుగు చేరి దోమలు ఎక్కువగా ఉన్నాయి. అధికారులు కాలనీల్లోని సమస్యల్ని పరిష్కరించాలి.

కుక్కల బెడద

కాలనీ: సాయిబాబానగర్
వార్డు: 25
జనాభా: 3000

కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీధి కుక్కలు రహదారులపై గుంపులుగా తిరుగుతూ కన్పించేవారిపై దాడులు చేస్తున్నాయి. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి విష పురుగులకు ఆవాసాలుగా మారాయి. రోడ్ల పక్కనే చెత్త చెదారం వేయడంతో వాహనదారులు ముక్కుమూసుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి తలెత్తింది. విద్యుత్తు తీగలు ఇళ్ల పక్కనే వెళ్తూ ప్రమాదకరంగా మారాయి. అధికారులు స్పందించి కాలనీల్లోని సమస్యల్ని పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



సాయిబాబానగర్‌లో రహదారి పక్కనే చెత్త

పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లాలో పత్తి కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి రెహమాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు జరుగుతుందన్నారు. రైతులు తమ వివరాలను సమీపంలో రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

పోలీసుస్టేషన్ తనిఖీ

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: బండిఆత్మకూరు పోలీసుస్టేషన్‌ను ఆదివారం దిల్లీ ఎన్జీవో బృంద సభ్యులు రఘునాథరెడ్డి, హేమంత్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా



స్టేషన్‌లోని రికార్డులు తనిఖీ చేసి స్టేషన్ ఆవరణాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని సిబ్బందికి సూచించారు. నంద్యాల తాలుకా సీఐ అస్రార్‌బాషా, ఎస్సై జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడి మృతి

రామకుప్పం, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడి అనుమానాస్పదమృతిపై ఆరా తీస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా రామకుప్పం పోలీసులు వివరాలు తెలిపారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండల కేంద్రంలోని ఆర్‌సీనగర్‌కు చెందిన ఏసెఫ్ (53) గురుకుల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ నెల 2 న దసరా సెలవులు ఇవ్వడంతో అదే రోజు సాయంత్రం అనారోగ్యంగా ఉండటంతో డాక్టర్ దగ్గరికి వెళ్లి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అనంతరం కేటాయించిన గదిలోకి వెళ్లిపోయారు. ఆదివారం పాఠశాల ఆవరణలో దుర్వాసన వస్తుండటంతో భద్రతా సిబ్బంది ఆ గదిని పరిశీలించగా కుళ్లినస్థితిలో మృతదేహం కనిపించింది. వారు పాఠశాల ప్రిన్సిపల్, పోలీసులకు సమాచారం అందించారు. కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్సై నరేశ్, రామకుప్పం ఏఎస్ఐ రెడ్డిశేఖర్ తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అనారోగ్యంతో మృతి చెందారా..? ఆత్మహత్య..? చేసుకున్నారా..? అనేది తేలాల్సి ఉందని చెప్పారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని వారు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మురుగు పారక.. వేదన తీరక

నంద్యాల పట్టణం కాంతినగర్‌లోని జిల్లా ప్రజా రవాణా కార్యాలయం పక్క వీధిలో మురుగు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని రోజులుగా పారిశుద్ధ్య సిబ్బంది కాలువల్ని శుభ్రం చేయకపోవడంతో మురుగు పారక దుర్వాసన వస్తోంది. పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్ని శుభ్రం చేయించి సమస్యల్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం



రాకపోకలకు ఇబ్బందులు




నంద్యాల పట్టణం గాంధీచౌక్‌లో మార్కెట్‌కు, సరకుల కొనుగోలుకు వచ్చే ద్విచక్ర వాహనదారులు రోడ్లపైన డివైడర్లకు మధ్యనున్న ఖాళీ స్థలంలో వాహనాలు నిలుపుదల చేస్తుండటంతో ప్రయాణికులు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. దసరా సమీపిస్తుండడంతో ప్రజలు సరకుల కోసం మార్కెట్‌కు ఎక్కువ మంది వస్తుండటంతో ఈ ప్రాంతం రద్దీగా మారింది. ట్రాఫిక్ సమస్య ఎక్కువవుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

పరిసరాలు శుభ్రం చేయరూ!

గట్టలనగర్ దగ్గర ఉన్న విద్యుత్తు స్తంభం చుట్టూ గడ్డి, ముళ్లపొదలు పెరగడంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి తీగలను అల్లుకున్నాయి. మార్కెట్‌యార్డులో ఉన్న నీటి ట్యాంకు చుట్టూ పిచ్చిమొక్కలు చుట్టేశాయి. ట్యాంకును శుభ్రం చేసేందుకు ఏర్పాటు చేసిన మెట్లను కూడా తీగలు కప్పేశాయి. కొన్ని నెలలుగా ట్యాంకును శుభ్రం చేయకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో బాగు చేయాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం



గుంతల దారి.. కష్టాలే మరి



కాకనూరుకు వెళ్లే ప్రధాన రహదారి నిండా గోతులే ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులుకలుగుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. ఎక్కడ గొయ్యి ఉందో తెలియక కుదుపులకు ఇబ్బందులతో రాకపోకలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి గోతుల్ని పూడ్చాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కాకనూరు(బండిఆత్మకూరు)

అవీ.. ఇవీ.. అన్నీ..

నందికొట్కూరు, న్యూస్‌టుడే: ఆబ్కారీ దుకాణాలకు టెండర్లు వేసేందుకు ఎవరూ భయపడొద్దని జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్ తెలిపారు. ఆదివారం నందికొట్కూరు ఎక్సైజ్‌శాఖ కార్యాలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో 105 మద్యం దుకాణాలుండగా, ఇప్పటికి 220 దరఖాస్తులు వచ్చాయన్నారు. సీఐ రామాంజనేయులు, ఎస్సై జఫ్రుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం మండలంలో రెండు మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆబ్కారీ సీఐ కిషోర్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

కొత్తపల్లి, న్యూస్‌టుడే: కొత్తపల్లి మద్యం దుకాణానికి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ ఎస్సై వీరస్వామి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

పాములపాడు, న్యూస్‌టుడే: పాములపాడులో మద్యం దుకాణానికి ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ తెలిపారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని 18వ వార్డులో ఉన్న పురాతన కొలనులోని పూడికను కార్మికులు ఆదివారం తొలగించారు. కమిషనర్ బేబి, ఉప ఛైర్మన్ రబ్బానీ, కౌన్సిలర్ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో చెత్తను తొలగించారు.

గోస్పాడు, న్యూస్‌టుడే: రైతులకు నంద్యాల మార్కెట్ యార్డులో సోమవారం రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేస్తారని తెదేపా గోస్పాడు ఇంఛార్జి కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి తెలిపారు. అవసరమైన రైతులందరూ పాసు పుస్తకాలు తీసుకొని విత్తనాలు తీసుకోవాలన్నారు.

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రౌడీషీటర్లు చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎవరైనా ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమన్నారు.

గడివేముల, న్యూస్‌టుడే: మంచాలకట్ట చెరువు మట్టికట్ట కుంగిపోయింది. చిన్నతూము వద్ద మట్టికట్ట కుంగిపోయి రంధ్రం పడినట్లు రైతులు తెలిపారు.

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత వడ్డెర సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బాల నరసింహుడు, జిల్లా అధ్యక్షుడు బీవీఎన్ రాజు అన్నారు. ఆదివారం వడ్డె ఓబన్న వర్ధంతిని నిర్వహించి మాట్లాడారు.

ఎన్డీయే ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమౌతుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరివేనలో రూ. 2.20 కోట్లతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లకు రూ. 20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. నెయ్యి కల్తీ విషయంలో నిందితులు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఎంపీపీ తిరుపాలమ్మ, సర్పంచి మాణిక్యమ్మ, తెదేపా నాయకులు వంగాల శివరామిరెడ్డి, వేణుగోపాల్, దినకర్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

ఒకే పెన్సిల్‌పై తొమ్మిది అవతారాలతో జగన్మాత

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: దసరా నవరాత్రులను పురస్కరించుకొని నంద్యాలకు చెందిన చిత్రకారుడు, హంస పురస్కార గ్రహీత చింతపల్లె కోటేశ్ ఒక చిన్న కలర్ పెన్సిల్‌పై చుట్టూ మూడు వైపులా తొమ్మిది రూపాలతో అమ్మవారి సూక్ష్మచిత్రాలు మైక్రోపెన్నులతో వేశారు. కేవలం 30 నిమిషాల్లోనే వేశానని ఆయన తెలిపారు. ఆదివారం కోటేశ్ మాట్లాడుతూ జగన్మాత మహిషాసురుడితో తొమ్మిది రాత్రులు భీకరంగా యుద్ధం చేసి వధించి విజయం సాధించిందన్నారు. శైలపుత్రి దేవి, బాలాత్రిపుర సుందరి, కూష్మాండదేవి, బ్రహ్మచారిణి, స్కందమాత, కాత్యాయిని, భద్రకాళి, దుర్గాదేవి, మహిషాసుర మర్దిని చిత్రాలు వేసినట్లు చెప్పారు.



కోటేశ్ పెన్సిల్‌పై గీసిన జగన్మాత చిత్రాలు

వృత్తి విద్య ఉపాధికి తొలిమెట్టు



మహానంది: అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయిని శ్రీకళ, వ్యాపారి

బుక్కాపురం, (మహానంది), న్యూస్‌టుడే: వృత్తి విద్య.. ఉపాధికి తొలిమెట్టు అని ఒకేషనల్ సమన్వయకర్త సువర్చల, శిక్షకురాలు శ్రీకళ పేర్కొన్నారు. మహానంది మండలం తిమ్మాపురంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులకు బుక్కాపురంలోని ఎరువులు, పురుగుల మందు దుకాణంలో ఆదివారం పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఆలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం



ఆలయ ఈవో రామకృష్ణకు చెక్కును అందిస్తున్న భక్తులు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్.కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.లక్ష విరాళంగా అందించినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో రూ. లక్ష చెక్కును అందజేశారన్నారు. బనగానపల్లె మండలం ఇల్లూరి కొత్తపేటకు చెందిన వ్యక్తి కర్ణాటక రాష్ట్రంలోని బాగల్‌కోట జిల్లా జమఖండి గ్రామంలో నివాసం ఉంటున్న గురుప్రసాద్, వెంకటలక్ష్మి దంపతులు విరాళాన్ని ఇచ్చారన్నారు. స్వామి దర్శనం అనంతరం భక్తులకు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేసినట్లు ఈవో పేర్కొన్నారు.

రైతులకు న్యాయం చేసేందుకు కృషి

గడివేముల, న్యూస్‌టుడే: వర్షం వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో ఆదివారం నీటమునిగి దెబ్బతిన్న సోయాబీన్ పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మార్క్‌ఫెడ్ అధికారి నాగరాజుతో మాట్లాడారు. సోయాపంటను కొనేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంటనష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని వ్యవసాయాధికారి హేమసుందరరెడ్డిని ఆదేశించారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. తెదేపా మండల కన్వీనరు దేశం సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి తెదేపా నాయకులు ఈశ్వరరెడ్డి, శివా రెడ్డి, వడ్డు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



పెసరవాయి గ్రామంలో నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

సాహితీ కల్హారమాల పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న కవులు, సాహితీ వేత్తలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: తెలుగు పాఠకలోకంలో డా. కొండూరు శ్రీదేవి రచనలతో మానవీయ విలువలను పెంపొందిస్తున్నారని డా. గౌరీ శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు డా. గెలివి సహదేవుడు అధ్యక్షతన తెలుగు సాహిత్యం-శ్రీ దేవి రచనలు అనే అంశంపై సదస్సును నిర్వహించారు. అనంతరం డా. శ్రీదేవి రచించిన సాహితీ కల్హారమాల పుస్తకాన్ని కవులు, సాహితీవేత్తలు ఆవిష్కరించారు.

స్థలం విషయమై రగడ

పగిడ్యాల, న్యూస్‌టుడే: తూర్పు ప్రాతకోటలో స్థలం విషయమై దాడి జరిగినట్లు బాధితులు తెలిపారు. తూర్పు ప్రాతకోటకు చెందిన ఇ. లక్ష్మన్నపై మహేష్ గౌడ్, శంకర్‌గౌడ్, ఎల్లగౌడు, మల్లికార్జునగౌడ్, రంగమ్మ దాడికి పాల్పడ్డారని వారు పోలీసులను ఆశ్రయించారు. రాజీ చేసే ప్రయత్నం చేస్తామని, వినకపోతే కేసు దాఖలు చేస్తామని పోలీసులు తెలిపారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించండి



కేవీపీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఉసేనమ్మ

పగిడ్యాల, న్యూస్‌టుడే: డప్పు కళాకారుల సమస్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా నాయకురాలు గంధం ఉసేనమ్మ డిమాండు చేశారు, ఆదివారం పగిడ్యాలలోని దేవనగర్ కాలనీలో కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. కుల వివక్ష వ్యతిరేక నిర్మూలనకు కేవీపీఎస్ పని చేస్తుందని పేర్కొన్నారు.

నిధులు విడుదల చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయాలని ఆర్‌జేయూపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం. షరీఫ్, అధికార ప్రతినిధి ఎం. వీరబ్రహ్మం డిమాండు చేశారు. రెండేళ్లుగా పాఠశాల నిర్వహణ నిధులు మంజూరు చేయడం లేదని, ఈ ఏడాది అయినా మంజూరు చేయాలని వారు ఆదివారం ప్రభుత్వాన్ని కోరారు.

38 మంది గైర్హాజరు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 176 మందికి గానూ 20 మంది, సాయంత్రం 173 మందికి గానూ 18 మంది పరీక్షలకు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ సీఐ అస్రార్ బాషా బందోబస్తు నిర్వహించారు.

8 నుంచి తిక్కయ్యస్వామి ఉరుసు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 8 నుంచి తిక్కయ్యస్వామి దర్గా ఉరుసు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆత్మకూరులోని కప్పలకుంటలో వెలసిన తిక్కయ్యస్వామి దర్గా భక్తులపాలిట మహిమాన్వితంగామారింది. 1955లో తిక్కయ్యస్వామి జీవసమాధి వద్ద దర్గాను నిర్మించిన నాటి నుంచి నేటి వరకు ప్రతి ఏడాది తిక్కయ్యస్వామి దర్గాలో ఉరుసు మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. తిక్కయ్యస్వామి దర్గా ఉరుసుకు హైదరాబాదు, కర్నూలు, నంద్యాల, ఆదోని, కర్ణాటక, మార్కాపురం, ఆళ్లగడ్డ, బనగానపల్లితోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. ప్రస్తుతం ముజావర్ అలీ వంశస్తులు దర్గాలో ప్రార్థనలు చేస్తున్నారు. ఈ నెల 8 నుంచి తిక్కయ్యసామి ఉరుసు నిర్వహించనున్నట్లు ముజావర్ అలీ వెల్లడించారు. ఈ నెల 8న గంధం, 9న ఉరుసు, 10న జియారత్ ఫాతెహా నిర్వహించనున్నారు.



కప్పలకుంటలోని దర్గా

విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధికి 'కార్యశాల'

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధికి 'కార్యశాల' ఉపయోగపడుతుందని శిక్షకుడు ఉదయ్ పేర్కొన్నారు. ఆదివారం నేషనల్ డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ వర్క్‌షాపు ముగిసింది. నేషనల్ విద్యాసంస్థల ఛైర్మన్ డా. ఎస్. ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో కొలువులు సాధించేందుకు వీలుగా వర్క్‌షాపును నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రిన్సిపల్ వేణుగోపాల్, ప్లేస్‌మెంట్ అధికారి సాయికుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షలు అందజేత

కాకనూరు(బండిఆత్మకూరు), న్యూస్‌టుడే: కాకనూరుకు చెందిన తెదేపా నాయకులు, బూత్ కన్వీనరు శ్రీనివాసులు పాముకాటుతో మృతి చెందడంతో తెలుగు దేశం తరఫున బాధిత కుటుంబ సభ్యులకు శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి రూ. 2 లక్షలు అందజేశారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి మహమ్మద్ రిజ్వాన్ వైద్య ఖర్చులకు రూ. 2 లక్షల నగదును అందించినట్లు ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.. శిరువెళ్ల గ్రామానికి చెందిన మహమ్మద్ రిజ్వాన్ సీఎస్ఈ చివరి సంవత్సరం చదువుతుండగా అనారోగ్యానికి గురయ్యాడన్నారు.

పుర ఆదాయానికి గండి

అధికారుల చేతివాటం



నంద్యాల పురపాలకం, రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పురపాలక సంస్థ పరిధిలో ట్రేడ్‌లైసెన్సు బకాయిలు పెద్దఎత్తున పేరుకుపోతున్నాయి. లైసెన్సు ఉన్న దుకాణాల నుంచి రుసుంలు వసూలు చేయడం లేదు. కొత్తగా ఏర్పాటు చేసుకుంటున్న దుకాణదారుల నుంచి లైసెన్సులు ఇవ్వకుండా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఎక్కువవుతున్నాయి. పట్టణంలో వేల సంఖ్యలో దుకాణాలున్నా.. లైసెన్సులు తీసుకున్న వారి సంఖ్య తక్కువగానే ఉంది. పట్టణంలో చాలా దుకాణాలు లైసెన్సులు లేకుండానే నిర్వహిస్తున్నాయనే విమర్శలు రేగుతున్నాయి. గతంలో అనుమతి పొందినవారు కూడా వాటిని రెన్యువల్ చేసుకోవడం లేదు. ఫలితంగా పురపాలక ఆదాయానికి ఏటా రూ.12 లక్షలకు పైగా గండి పడుతోంది.

పర్యవేక్షణ లేక...

నంద్యాల పట్టణంలో సుమారు 3 లక్షల మంది జనాభా ఉండగా, చిన్నా, పెద్దా దుకాణాలు కలిపి ఎనిమిదివేలకు పైగా ఉన్నాయి. గత ఏడాది పట్టణంలో దాదాపు 4,324 పైగా దుకాణాలకు మాత్రమే లైసెన్సులు ఉన్నాయి. ఈ ఏడాది మరో వెయ్యి వరకు దుకాణాలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు. పట్టణ ప్రజారోగ్య విభాగం ప్రతి దుకాణం నుంచి లైసెన్సు, రెన్యువల్ రుసుములు వసూలు చేయాలి. ఈ ప్రక్రియ ఏటా ఏప్రిల్ 1 లోగా పూర్తి చేయాలి. అప్పటిలోగా చెల్లించనివారు ఏప్రిల్ నెలాఖరు నాటికి 25 శాతం అపరాధ రుసుంతో కలిపి చెల్లించాలి. మే 1 నాటికి అన్ని దుకాణాల నుంచి పూర్తిస్థాయిలో సొమ్మును వసూలు చేయాల్సి ఉంటుంది. లేకుంటే సంబంధిత అధికారి సొంత సొమ్ము జమచేయాలి. రుసుము చెల్లించిన ప్రతి దుకాణంలోనూ లైసెన్సు ధ్రువపత్రాన్ని ప్రదర్శించాలి. కానీ నగరంలోని పలు కాలనీల్లో పలువురు దుకాణదారులు ట్రేడ్‌లైసెన్సు తీసుకోకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనికి కొంతమంది పురపాలక అధికారుల సహకారం ఉందనే ఆరోపణలు ఉన్నాయి.

పట్టణ పరిధిలో ట్రేడ్ లైసెన్సు బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయి. అయిదేళ్లుగా దాదాపు రూ.60 లక్షల మేర బకాయిలు పేరుకు పోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీన్ని వసూలు చేయడంలో పట్టణ ప్రజారోగ్య విభాగం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పట్టణ పరిధిలో 8 వేలకు పైగా దుకాణాలు ఉండగా అధికారుల లెక్కల్లో మాత్రం 5 వేల మంది మాత్రమే లైసెన్సులు ఉన్నట్లు చూపుతున్నారు. లైసెన్సులు వసూలు చేయని దుకాణాలు సుమారు 3 వేలకు పైగా ఉన్నట్లు అంచనా. ఈ డబ్బును పురపాలక ఖజానాలో జమ చేయకుండా అధికారులు జేబులు నింపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏటా రూ. 37 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా కేవలం రూ. 25 లక్షలు మాత్రమే వసూలవుతున్నాయి. ఇలా ఏటా నిధులు రూ. లక్షల్లో పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలు రేగుతున్నాయి.

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

బీసీలకు న్యాయం చేయాలి


ఏపీ రాష్ట్ర గనుల, భూగర్భ వనరుల ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన తెదేపా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే : నామినేటెడ్ పోస్టులను బీసీలకు కేటాయించి, బీసీలకు న్యాయం చేయాలని నంద్యాల జిల్లా తెదేపా బీసీ సెల్ అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున తదితరులు మంత్రి రవీంద్రను కోరారు. విజయవాడలో మంత్రి స్వగృహంలో ఆయన ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇ.వి. రమణ, బీసీ సెల్ అధికార ప్రతినిధి ధనుంజయ్య, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ప్యాపిలి, న్యూస్‌టుడే : హుస్సేనాపురం ఫీడర్ మరమ్మతుల కారణంగా హుస్సేనాపురం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని హుస్సేనాపురం, బావిపల్లి గ్రామాల్లో సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్యాపిలి విద్యుత్తుశాఖ ఏఈ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. రైతులకు ఇచ్చే కరెంటు ఉదయం 4గంటల నుంచి ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

ప్యాపిలి : సమస్య : మండలంలోని ఎన్.రంగాపురం గ్రామంలో నీటి ట్యాంకుకు బిరడా లేక నీరు వృథాగా పోతుంది - **లక్ష్మీదేవి, గ్రామస్థురాలు**

సమాధానం : పంచాయతీ సిబ్బంది చేత బిరడాను ఏర్పాటు చేయిస్తాం. - **సుబ్బారెడ్డి పంచాయతీ సర్పంచి**

ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కలిసిన సుబ్బారెడ్డి

డోన్ పట్టణం న్యూస్‌టుడే : ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర ఛైర్మన్ కొనకళ్ల నారాయణను మచిలీపట్నంలోని ఆయన స్వగృహంలో ఛైర్మన్‌తో పాటు సోదరుడు కొనకళ్ల జగన్నాథరావులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మురళీకృష్ణగౌడ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. డోన్ ఆర్టీసీ డిపోకు బస్సు సౌకర్యాలను కల్పించడంతో పాటు డిపో అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.


ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర ఛైర్మన్ కొనకళ్ల నారాయణను కలిసిన ధర్మవరం సుబ్బారెడ్డి

బీసీ రాజారెడ్డిని కలిసిన ఉత్తమ సర్పంచు

బనగానపల్లి, న్యూస్‌టుడే : మండల పరిధిలోని పాతపాడు సర్పంచు బెడదల మహేశ్వరరెడ్డి ఇటీవల జిల్లా ఉత్తమ సర్పంచుగా ఎంపికయ్యారు. దీంతో ఆదివారం పట్టణ మాజీ సర్పంచు బీసీ రాజారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ మాట్లాడుతూ ఉత్తమ సర్పంచుగా అవార్డు రావడం అభినందనీయమని తెలిపారు.


బీసీ రాజారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బెడుదల మహేశ్వరరెడ్డి

అడుగడుగునా అక్రమాలు..అడ్డుకునేవారెవరు


పట్టుబడిన గంజాయిని చూపుతున్న పోలీసులు (పాత చిత్రం)

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే : డోన్‌లో రోజురోజుకు అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువవుతున్నాయి. నేరపూరిత ఘటనలు పెరుగుతున్నాయి. ఐదేళ్లుగా మట్కా, గంజాయి, జూదం, అక్రమంగా రేషన్ బియ్యం సరఫరా, భూకబ్జాలు, మైనింగ్ మాఫియాకు డోన్ అడ్డాగా మారిపోయింది. చోరీలు, దారిదోపిడీలు, చైన్‌స్నాచింగ్, బ్లేడ్‌బ్యాచ్ అల్లరిమూకల ఆగడాలకు అడ్డూఅదుపు లేకపోతోంది. గత ప్రభుత్వం కొందరు నాయకులు అక్రమ మద్యం, నాటుసారా రవాణాదారులకు సహకారం అందించడంతో ఏరులైపారాయి. యువత గంజాయి మత్తులో చిత్తయ్యారు. గతంలో కొందరు అధికారులు కూడీ చూసీచూడనట్లుగా వ్యవహరించాలనే ఆరోపణలు ఉన్నాయి. సైబర్ మోసాలు, ఐపీలు, అధికవడ్డీ మోసాలు పట్టణంలో ఎక్కువవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి డోన్‌పై ప్రత్యేక నిఘా సారించాలని కోరుతున్నారు.


ఇటీవల మద్యం నిందితులను చూపుతున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాకేశ్

నమోదైన కేసుల వివరాలు

☛ డోన్ రైల్వేస్టేషన్ జంక్షన్ కావడంతో నిత్యం రైళ్ల ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. రైలులో అక్రమ మద్యం, గంజాయి సరఫరా ఎక్కువగా సాగుతోంది. గత మూడేళ్లుగా రైలులో గంజాయి కేసులు 13 నమోదు కాగా 38.5 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

☛ డోన్ నియోజకవర్గంలో తెలంగాణ, కర్ణాటక, గోవా రాష్ట్రాలకు చెందిన మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఈ ఏడాదిలో అక్రమ మద్యంపై పోలీసులు 9 కేసులు నమోదు చేశారు. 11 మందిని అరెస్ట్ చేసి, 963 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

☛ వారం రోజుల కిందట గోసానిపల్లి గ్రామంలో సుంకులమ్మ గుడి వెనుక ప్రాంతంలో గోవా మద్యంను విక్రయిస్తున్న ముగ్గురిని గ్రామీణ సీఐ రాకేశ్ అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి గోవా మద్యం 528 క్వార్టర్ సీసాలు, 42 ఫుల్‌బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

☛ ఈ ఏడాదిలో 77 నాటుసారా కేసులు నమోదయ్యాయి. 94 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 1692 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. రూ.2,53,800 విలువ అని పోలీసులు తెలిపారు.

☛ ఈ నెల 3న మండలంలోని దేవరబండ గ్రామ స్టేజీ సమీపంలో భారీగా కర్ణాటక మద్యం పట్టుబడింది. స్కార్పియో వాహనంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా సీఐ రాకేశ్ దాడులు నిర్వహించి, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2112 కర్ణాటక టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

☛ డోన్ పట్టణంలోని గృహాలు, పొలాలు, గుట్టలు, కొండల్లో జూదం ఎక్కువగా సాగుతున్నట్లు పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. జూదం లక్షల్లో ఆడుతున్నట్లుగా సమాచారం. ఈ స్థావరాలపై పోలీసులు ఎన్నిసార్లు దాడులు చేసినా వారి తీరు మారడం లేదు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి


మొక్కజొన్న రైతులతో మాట్లాడుతున్న సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయకులు

సంజామల న్యూస్‌టుడే : మొక్కజొన్న రైతులకు వచ్చిన ఆదాయంలో సగం దళారులు, మరోసగం వ్యాపారుల చేతుల్లోకి వెళ్తోందని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయకులు అన్నారు. మండలంలోని అల్వకొండ గ్రామంలో ఆదివారం మొక్కజొన్న రైతులతో చర్చించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిలర్ రాధాకృష్ణ, నాయకులు భాస్కర్, నరసింహులు, పాములేటి, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకునే చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్. రంగనాయుడు అన్నారు. ఆదివారం ఆయన పడకండ్ల వద్ద మొక్కజొన్న రైతులతో మాట్లాడారు.

శిరివెళ్ల న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కజొన్న రైతులను ఆదుకుని సరైన గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి సోమన్న పేర్కొన్నారు.

రుద్రవరం న్యూస్‌టుడే : మొక్కజొన్న ధాన్యం క్వింటాకు రూ. 3,300 గిట్టుబాటు ధర కల్పించి, వర్షానికి తడిసిన ధాన్యాన్ని మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్నలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాజకీయాలకు అతీతంగా కలసికట్టుగా ఉండాలి

డోన్ నేరవిభాగం న్యూస్‌టుడే : రాజకీయాలకు అతీతంగా కలసి కట్టుగా ఉండి, వెనుకబడిన రెడ్ల కుటుంబాలను ఆదుకోవాలని రెడ్ల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని నందురెడ్డి స్వగృహంలో ఆ సంఘం నాయకులు సమావేశమై మాట్లాడారు. అక్టోబర్ 20 నుంచి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి కార్తిక వనభోజనాల ఆహ్వాన కరపత్రాలు పంపిణీ చేస్తామన్నారు.

మద్యం దుకాణాలకు ఎవ్వరైనా దరఖాస్తులు చేసుకోవచ్చు


మాట్లాడుతున్న ఎక్సైజ్, ప్రొహిబిషన్ జిల్లా అధికారి రవికుమార్

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే : మద్యం దుకాణాలకు ఎవరైనా దరఖాస్తులు చేసుకోవచ్చని, ఇప్పటివరకు డోన్ నియోజకవర్గంలోని 16 మద్యం దుకాణాలకు గాను 20 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చాయని నంద్యాల జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. ఆదివారం డోన్ ఎక్సైజ్, ప్రొహిబిషన్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే : నూతన మద్యం విధానాలపై కోవెలకుంట్ల ఎక్సైజ్ ఎస్సై ప్రవీణ్ నాయక్ అవగాహన కల్పిస్తూ ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల ఎక్సైజ్ పరిధిలో ఉయ్యాలవాడలో మద్యం దుకాణం నిర్వహిస్తామన్నారు.


మాట్లాడుతున్న డోన్ ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి

బేతంచెర్ల న్యూస్‌టుడే : మండలంలో 7 మద్యం దుకాణాలకు టెండర్ ప్రక్రియకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డోన్ ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం బేతంచెర్ల పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

రుద్రవరం న్యూస్‌టుడే : మద్యం దుకాణానికి ఆసక్తి ఉన్న వాళ్లు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆళ్లగడ్డ ఎక్సైజ్‌శాఖ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ ఎక్సైజ్ శాఖ పరిధిలో మొత్తం 19 మద్యం దుకాణాలు ఉన్నాయన్నారు.

రూ. 10లక్షల చెక్కు అందజేత


కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా రూ. 10లక్షల చెక్ అందజేత

ప్యాపిలి, న్యూస్‌టుడే : హైవే పెట్రోలింగ్ వాహనంలో పని చేస్తున్న రేపల్లె రాముడు ప్రమాదవశాత్తు పోతుదొడ్డి గ్రామంలో మృతి చెందారు. హైవే అధికారులతో మాట్లాడి రూ. 10లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం


డీఎస్పీని సన్మానిస్తున్న హ్యాపీ సండే క్లబ్ సభ్యులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : క్రమం తప్పని వ్యాయామంతోనే సంపూర్ణమైన ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాపీ సండే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వ్యాయామం చేయడంతో ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. రోటరీ క్లబ్ ప్రతినిధి డా. రాంగోపాల్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ నాయబ్ రసూల్, సలావుద్దీన్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

చాగలమర్రి న్యూస్‌టుడే : వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని అటవీశాఖ అధికారి రామకృష్ణ తెలిపారు. చింతలచెరువు గ్రామంలో వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని కాలనీల్లో తిరుగుతూ రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. వన్యప్రాణుల సంరక్షణ, వాటిని చంపితే విధించే శిక్షల గురించి ప్రజలకు తెలియజేశారు. ఎఫ్‌బీవోలు నాగేష్, సుభాష్ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని చాటాలి

చాగలమర్రి, : క్రీడా పోటీల్లో గెలిచినా, ఓడినా క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని మరువకూడదని తెదేపా నాయకులు కొలిమి ఉసేనవలి, సమియుద్దీన్ తెలిపారు. పట్టణంలోని జడ్పీ బాలుర పాఠశాలలో సీనియర్ మెన్ హ్యాండ్ బాల్ జిల్లా జట్టు శిక్షణా కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు.

వడ్డెర ఓబన్న కృషిని ప్రభుత్వం గుర్తించాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే : బ్రిటిష్ వారితో పోరాటాలు చేసిన వ్యక్తుల్లో వడ్డె ఓబన్న ఒకరని, అతని కృషిని ప్రభుత్వం గుర్తించి, ఆయన వర్ధంతి, జయంతీలను ప్రభుత్వ లాంచనాలతో నిర్వహించేలా చూడాలని వడ్డెర సంఘం అధ్యక్షుడు జి.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. వడ్డెర సంఘం నాయకులు గోవింద, లక్ష్మీనారాయణ, సురేష్, ఎల్లస్వామి పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

బేతంచెర్ల, న్యూస్‌టుడే : స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వడ్డెర సంఘం నాయకులు మక్కల సుబ్బరాయుడు, దేరంగుల నాగభూషణం పేర్కొన్నారు.

భగవద్గీత విజేతలకు బహుమతులు


ఆకట్టుకున్న విద్యార్థినీల వేషధారణలు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే :దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, సమరత సేవా ఫౌండేషన్ సౌజన్యంతో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీల్లో 72మంది విద్యార్థులు పాల్గొనగా మొదటి సూర్యధరణి, రెండు చతుర, మూడు బహుమతులను గీతిక గెలుచుకున్నారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు పెండేకంటి నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

రస్తా సమస్య పరిష్కారం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని 32వ వార్డులో శ్రీనివాసనగర్‌లో రస్తా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ఎన్నికల ప్రచార సమయంలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి కుమార్తె కోట్ల నివేదితా రెడ్డి దృష్టికి ఆ కాలనీవాసులు విన్నవించుకున్నారు. ఈ మేరకు నేడు కోట్ల రస్తా సమస్యను పరిష్కరించారు.

అధ్వానంగా పంట కాలువలు

కోవెలకుంట్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎస్ఆర్‌బీసీ పంట కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువలలో గడ్డి, ముళ్లపొదలు నిండిపోయాయి. ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సాగు నీటికి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.
- **న్యూస్‌టుడే కోవెలకుంట్ల గ్రామీణం**



అపురూపం...అమ్మరూపం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నాలుగో రోజు అమ్మవారిని లలితా త్రిపుర సుందరిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. –న్యూస్‌టుడే బృందం


బనగానపల్లిలో శ్రీ మీనాక్షి దేవి అలంకరణలో..


శిరివెళ్ల : యర్రగుంట్లలో లలిత త్రిపుర సుందరీదేవి అలంకరణలో..


డోను పట్టణం: కనకదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో...


బేతంచెర్ల : వాసవీమాతా ఆలయంలో లలిత త్రిపురసుందరిదేవి అలంకరణంలో

పతకాల పరుగు

☛ శిశుమందిరం చిన్నారుల రాణింపు

ప్యాపిలి, న్యూస్‌టుడే: చదువుతో పాటు ఆటల్లోనూ రాణిస్తున్నారు. ఆరో తరగతి నుంచే పాఠశాల స్థాయిలో గురువుల సహకారంతో పరుగు పందెం పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటూ ఆదర్శంగా శిశు మందిరం పాఠశాల విద్యార్థులు నిలుస్తున్నారు. జాతీయ స్థాయి పోటీలకు తర్ఫీదు పొందుతున్నారు.

జాతీయస్థాయిలో ఆడాలన్నదే లక్ష్యం



సురేంద్ర, అరుణ దంపతుల కుమార్తె శ్రుతి ఏడో తరగతి చదువుతూ 2024 ఆగస్టు 10, 11వ తేదీల్లో ప్రొద్దుటూరులో జరిగిన పరుగుపోటీల్లో సత్తా చాటి నిర్వాహకుల ప్రశంసలు అందుకొంది. ఆగస్టు 17, 18 తేదీల్లో నరసరావుపేటలో రాష్ట్రస్థాయిలో జరిగిన 1500 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచింది. ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను అందుకొంది. జాతీయ స్థాయిలో రాణించి మరిన్ని పతకాలు సాధించాలని తర్ఫీదు పొందుతున్నట్లు శ్రుతి చెబుతోంది.

సైన్యంలో చేరాలని



రంగస్వామి, నందినిల కుమార్తె జాహ్నవి ఏడోతరగతి చదువుతోంది. తల్లితండ్రులు కూలి పనులు చేస్తూ చదివిస్తున్నారు. ప్రొద్దుటూరులో జరిగిన పోటీల్లో సత్తా చాటడంతో నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆగస్టు 17, 18వ తేదీల్లో నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పరుగు పోటీల్లో ప్రతిభ చూపి ప్రశంసాపత్రాన్ని అందుకొంది. జాతీయ స్థాయిలో రాణించి సైన్యంలో చేరాలన్నదే తన ఆశయమని జాహ్నవి చెబుతోంది.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల న్యూస్‌టుడే : బేతంచెర్ల పట్టణంలోని శ్రీభాగ్యోదయ ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం టీటీడీ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు పెద్దకాశయ్య, చిన్న కాశయ్య, దానమయ్య, రసూల్, శ్రీనివాసులు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు రిజ్వాన్, శంకర్‌రెడ్డి, రాంబాబు, లోకేష్ గౌడ్, గోకారి, మురళీ, ప్రశాంత్, చైతన్య, ఉషా కల్యాణి, సుభాషిని, నాగరత్నమ్మ పాల్గొన్నారు..

చాగలమర్రి, న్యూస్‌టుడే : చాగలమర్రి పట్టణంలోని ఆర్‌సీఎం ఉన్నత పాఠశాలలో 1998-90 బ్యాచ్ 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. నాటి ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్‌రెడ్డి, నాగేంద్రప్రసాదు, సుందరయ్య, మౌలాలి, చంద్రశేఖర్, జోజిరెడ్డి, ఉషారాణి, ఆంథోనమ్మలను సన్మానించారు.


చాగలమర్రిలో గురువులతో..


ఉపాధ్యాయులతో..

రుద్రవరం న్యూస్‌టుడే : చిన్ననాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకుంటూ బాల్యమిత్రులు సరదాగా కబుర్లు చెప్పుకొన్నారు. 2000-2001 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రుద్రవరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుసుకొని సంతోషంగా గడిపారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

ప్యాపిలి న్యూస్‌టుడే : అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా సత్ప్రవర్తనతో మెలగాలని జలదుర్గం ఎస్సై నాగార్జున రౌడీ షీటర్లకు సూచించారు.

బేతంచెర్ల న్యూస్‌టుడే : గూటుపల్లె గ్రామ సమీపంలో పాలుట్ల రంగస్వామికి హెచ్‌కొట్టాల గ్రామానికి చెందిన పువ్వాడి రామకృష్ణుడు, రమాదేవి, రామనంద చౌదరి, దివ్యభారతి వెండి దీపస్తంభాలను అందజేశారు.

కోవెలకుంట్ల గ్రామీణం న్యూస్‌టుడే : అమడాల బీసీ కాలనీవాసులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకీ నీరందించే విద్యుత్ మోటారు పనిచేయకపోవడంతో దాదాపు 150 కుటుంబాలకు నీటి కొరత ఏర్పడింది.

బనగానపల్లి న్యూస్‌టుడే : మధుమేహం వ్యాధి తగ్గించుకోవడానికి వ్యాయామం, నడక అవసరమని షుగర్, వైద్యుడు మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం మధుమేహం వ్యాధిగ్రస్తులకు అవగాహన నిర్వహించారు.

డోన్ పట్టణం న్యూస్‌టుడే : కుండీల వద్ద, రహదారుల పక్కన చెత్త నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని పురపాలక కమిషనర్ ప్రసాద్‌గౌడ్ పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు.

ఆర్.కృష్ణాపురం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని ఆర్.కృష్ణాపురం గ్రామంలోని రామతీర్థం పుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి పుట్టాలమ్మ, పరశురామేశ్వర, లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే : స్థానికంగా ఉన్న శుద్ధ జల కేంద్రాన్ని తెదేపా నాయకులు గూడూరు నాగేశ్వరెడ్డి, నరసింహుడు, విజయ్, ప్రసాద్, దస్తగిరి, టైలర్ రాము ఆదివారం ప్రారంభించారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే : పట్టణంలోని కొండపేటకు చెందిన షేక్ మదార్‌వలిని కొట్టి చంపిన కేసులో ఐదుగురిని ఆదివారం గుత్తిరోడ్డులోని మార్కెట్‌యార్డు వద్ద నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. అదే కాలనీకి చెందిన బేస్త హరిక్రిష్ణ, బేస్త చెన్నకేశవులు, బేస్త రంగముని, దూదేకుల మౌలాలి, చాకలి శివసాయిలు కలసి గతనెల 17న రాత్రి మదార్‌వలిపై కర్రలతో, రాడ్లతో దాడి చేశారు. కర్నూలులో చికిత్స పొందుతూ గతనెల 26న మృతి చెందినట్లు సీఐ పేర్కొన్నారు.

రైతులను మోసం చేసిన వ్యాపారి

కొలిమిగుండ్ల న్యూస్‌టుడే: మండలంలోని యర్రగుడి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డితో పాటు మరో 19మంది రైతులు పండించిన శనగ పంటను రెండు నెలల క్రితం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు తాలూకా రాజుపాలేనికి చెందిన సుబ్బరాయుడు ఆయన కొడుకులు సునీల్ కుమార్, సురేంద్ర, అల్లుడు గంగయ్యలకు పంటను విక్రయించారు. ఆ రైతులకు దాదాపు రూ. 56లక్షల 48వేలు ఇవ్వాలి. నేటి వరకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆదివారం రైతు కృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సుబ్బరాయుడితో పాటు మరో ముగ్గరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ సురేశ్‌బాబు తెలిపారు.

గ్యాస్‌బండల ఆటో బోల్తా...తప్పిన ప్రమాదం

బనగానపల్లి గ్రామీణం న్యూస్‌టుడే : మండల పరిధిలోని యనకండ్ల గ్రామ సమీపంలో గ్యాస్‌బండలతో వస్తున్న ఆటో టైరు ప్రమాదవశాత్తు పేలిపోవడంతో ఆటో బోల్తా పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

పక్కనే నీళ్లు.. పొలాలు బీళ్లు


సౌకర్యాలు లేక బీడుగా మారిన పొలాలు

అవుకు న్యూస్‌టుడే : వ్యవసాయమే ఆధారంగా జీవనాన్ని సాగించే రైతుల పరిస్థితి మండలంలోని చెర్లోపల్లెలో దయనీయంగా మారింది. రూ.లక్షలు విలువ చేసే భూములు బీళ్లుగా మారిపోయాయి. సారవంతమైన పొలాలకు అవసరమైన నీళ్లు, విద్యుత్తు, రహదార్లు కల్పించకపోవడమే ప్రధానంగా కారణంగా తెలుస్తోంది. చెర్లోపల్లె పరిధిలో 800 ఎకరాకు పైగానే వ్యవసాయ భూమి ఉండేది. అవుకు జలాశయం నిర్మాణానికి దాదాపు 600ఎకరాల వ్యవసాయ భూమిని భూసేకరణ కింద అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరో 200 ఎకరాల భూమి రైతుల ఆధీనంలోనే ఉంది. ఆ భూమి అంతా వృథాగా మారింది. అన్ని సౌకర్యాలు కల్పిస్తామంటూ నాయకులు, అధికారులు చేసిన ప్రకటనలు కాలగర్భంలో కలిసిపోయాయి. సాగు భూమి ఉన్నా వ్యవసాయం చేయడానికి సాధ్యపడకపోవడంతో గని కార్మికులుగా మారి జీవనాన్ని సాగించే పరిస్థితి ఏర్పడింది.


కలగానే సౌకర్యాల కల్పన

అవుకు జలాశయం వద్ద ఎత్తిపోతల పథకానికి భూసేకరణ చేపట్టగా, మిగిలిన దాదాపు 200 ఎకరాల భూమికి సాగునీటిని కల్పిస్తామంటూ 12 ఏళ్ల క్రితం పునరావాస కమిషనర్ ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు పొలాలకు సాగునీటి సౌకర్యాన్ని కల్పించలేదు. జలాశయంలో నీరు నిండుగా ఉన్న సమయంలో అవతలి గట్టులో ఉన్న పొలాలకు రైతులు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సులువుగా వెళ్లడానికి రహదారిని ఏర్పాటు చేస్తామని గతంలో అధికారులు హామీ ఇచ్చి విస్మరించారు. రైతుల పొలాలకు విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించకపోవడంతో నీటి కోసం ఏర్పాటు చేసుకున్న బోర్లు వృథాగా మారాయి. ఏళ్లు గడిచినా..సమస్య పరిష్కారం కాకపోవడంతో కర్షకులు అవస్థలు పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి నీటి సౌకర్యాన్ని కల్పిస్తే అన్ని రకాల పంటలు పండించుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

గని కార్మికులుగా భూయజమానులు

భూములు ఉన్నా పంటలు సాగు చేయలేని పరిస్థితి ఉండటంతో గ్రామానికి చెందిన దాదాపు 30 కుటుంబాలకు చెందిన రైతులు గని కార్మికులుగా మారి జీవనాన్ని సాగిస్తున్నారు. సమీపంలోని నాపరాతి గనులకు వెళ్లి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. భూములు బీడుగా మారిపోవడంతో వ్యవసాయం లేదంటూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సైతం అధికారులు గ్రామానికి దూరం చేయడంతో అవస్థలు తప్పడం లేదంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలి



– కె.శివశంకర్, చెర్లోపల్లె, రైతు

పునరావాస సాయం అంతంత మాత్రంగానే ఉంది. అధికారులు నగదు, ఇంటి స్థలాలు ఇప్పించి అరకొర వసతులతో చేతులు దులుపుకొన్నారు. వ్యవసాయానికి అనువైన సౌకర్యాలు కల్పించకపోవడంతో పదేళ్లుగా భూమి బీడుగా ఉండటంతో ఆ పొలాల్లో కంప చెట్లు పెరిగిపోయాయి. అధికారులు దృష్టి సారించి జీవనోపాధిని కల్పించాలి. పొలాలను సాగు చేసుకునేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలి.